ప్రతి గడపకు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గిరిజనులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



గిరిజన మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కొండమొదలు కాలనీలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పాడేరు రూరల్ : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మారుమూల దేవాపురం గ్రామ సచివాలయం పరిధిలోని అంటిలోవ, జీలుగుపాడు, పందిగుంట, దప్పాడ, తరగం, దేవాపురం, కాంగెడ్డ, డి.కొత్తూరు, వలసమామిడి గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో పాటు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జోరు వానను సైతం పట్టించుకోకుండా ఆయా గ్రామాల్లో 330 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా పొందుతున్న లబ్ధిని గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల ఆర్థిక స్థితిగతులు మారాయన్నారు. గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ, బాక్సైట్ జీవో రద్దు, పాడేరులో మెడికల్ కళాశాల ఏర్పాటు తదితర అంశాలను గిరిజనులకు వివరించారు. గ్రామాల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా గిరిజనమంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్ కిల్లు పరమేశ్వరి, వైస్ సర్పంచ్ వి.రమణమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, సర్పంచ్‌లు రాంబాబు, రాంబాబు అప్పలకొండ, బసవన్నదొర, ఎంపీటీసీలు మీనా, ఎర్రయమ్మ, రామకృష్ణపాత్రుడు, సన్యాసిరావు, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, నాయకులు కన్నాపాత్రుడు, దశమూర్తి, బాబూరావు తదిదతరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. కితలంగి పంచాయతీ కేంద్రంలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. జోరు వానను సైతం లెక్కచేయకుండా పంచాయతీలో 65 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనులకు ఎటువంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరుచేస్తున్నారన్నారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దేవీపట్నం: అర్హత కలిగిన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. కొండమొదలు పునరావాస కాలనీలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీలో గల కొండమొదలు, తెలిపేరు, తాళ్లూరు, మెట్టగూడెం గ్రామాల్లోని 170 గడపలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, నాయకులు కందుల బాబ్జి, మురళీకృష్ణ, సత్యనారాయణ, లక్ష్మణ్, కృష్ణబాబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజా సమస్యల పరిష్కారం



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రమేష్, అధికారులు, నేతలు

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్లలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. పంచాయతీలో 1347 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. ఎంపీడీవో లాలం సీతయ్య, మండల పార్టీ అధ్యక్షుడు జల్లిబాబులు, మండల కన్వీనర్ బండి సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ సుమర్ల సూరిబాబు, సర్పంచ్ ముత్యాలమ్మ, ఎంపీటీసీ కుమారి, బూత్ కమిటీ కన్వీనర్ పాట్టిక పోతురాజు, సర్పంచ్ సోమన్నదొర, నేతలు రాజు, వనంబాబు, సంజీవ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సహకరించాలి

రాజవొమ్మంగి: ఎన్‌హెచ్ 516ఈ విస్తరణలోభాగంగా రోడ్డు నిర్మాణ పరిధిలో ఉన్న దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి షాపు యజమానులను సూచించారు. ఎన్‌హెచ్ నిర్మాణ పరిధిలో గల దుకాణాలు, ఇళ్ల యజమానులతో మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన సరకులు



వార్డెన్‌లకు సూచనలిస్తున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని గిరిజన సహాయ సంక్షేమ శాఖ కార్యాలయంలో చింతపల్లి, జీకే వీధి వసతిగృహాల వార్డెన్లతో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన సరకులు అందజేయాలన్నారు. హాస్టళ్లకు పంపిణీ చేసే పాలు, గుడ్లు, పప్పుధినుసులు తదితర సరకులు నాణ్యతగా ఉంటేనే తీసుకోవాలని, లేనిపక్షంలో వాటిని తిరిగి పంపేయాలని సూచించారు. గుడ్లు 50 గ్రాములు కన్న తక్కువ ఉండకుండా చూసుకోవాలన్నారు. జీసీసీ సరఫరా చేస్తున్న సరకులు నేరుగా హాస్టళ్లకే చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డెన్‌లు వినాయకరావు, నూకరత్నం, తిరుపతి, గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదం భారతదేశ వారసత్వ సంపద



మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్

చింతూరు: ఆయుర్వేదం భారతదేశ వారసత్వ సంపద అని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ అన్నారు. స్థానిక ఆఫ్రిన్ వైద్యశాలలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆయుర్వేదం పేద రోగులకు వరం వంటి దన్నారు. ఆయుర్వేద వైద్య ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇటీవల ఢిల్లీలో జరిగిన సదస్సులో కీర్తించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కరోనా కాలంలో ఎందరికో ఉచితంగా వైద్యం చేయడంతో పాటు గతేడాది వరదలకు సర్వం కోల్పోయిన వేలాది మందికి సాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని రోగాలకు ఆయుర్వేదంలో మందులను తయారుచేసి పేదలకు అందివ్వాలనేదే తన లక్ష్యమన్నారు. ఇతర దేశాల వైద్యులు పాల్గొన్న ఢిల్లీ సదస్సులో తనకు అవార్డు ఇవ్వడంతో పాటు సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని జమాల్‌ఖాన్ తెలిపారు.

ఉపాధ్యాయులకు సూచనలు



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో-2 మల్లేశ్వరరావు

గంగవరం: గంగవరం, టేకులవీధి ఆశ్రమ పాఠశాల్లో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశాలలను ఎంఈవో-2 మల్లేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు టీచర్ డైరీ, లెస్సెన్ ప్లాన్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పాఠశాల నిర్వహణ, తరగతులు నిర్వహణ అంశాలపై పలు సూచనలు చేశారు . టీఎల్ఎం లను సిద్ధం చేసుకొని విద్యా బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు యాప్‌లో నమోదు చేయాలన్నారు. హెచ్ఎంలు బి.నాగేశ్వరరావు, ఝాన్సీహేన్సన్ , సీఆర్పీలు సురేష్, విజయభాస్కర్, శివ, వెంకటలక్ష్మి , వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వర్షం

గంగవరం/హుకుంపేట: జిల్లాలో బుధవారం ఎకధాటిగా వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గంగవరంలోని తహసీల్దార్ కార్యాలయంలో వర్షపునీరు చేరింది. శ్లాబ్ నుంచి వర్షపునీరు కారడంతో కంప్యూటర్, ఫైల్స్ తడిసిపోయాయి. కార్యాలయం శ్లాబ్ పాడైందని,పెచ్చులూడుతుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతూ పనిచేస్తున్నారని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. శ్లాబ్ లీకులను తాత్కాలిక రిపేర్లు చేయిస్తున్నామని తహసీల్దార్ శ్రీమన్నారాయణ తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ బొంజుబాబు తదితరులు

పెదబయలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన బుధవారం జరిగింది. కార్యక్రమంలో మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సభ్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. శాఖలవారీగా సమీక్ష చేశారు. సీతగుంటలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను నిలువరించాలని ఎంపీటీసీ బొంజుబాబు చెప్పారు. మండల కేంద్రంలో ఆశ్రమ, గురుకుల పాఠశాలలు ఇతర పాఠశాలల్లో విద్యార్థులు వ్యసనాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు మాట్లాడుతూ మండలంలో అన్ని శాఖల అధికారులు. ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తేనే మండలం అభివృద్ధి బాట పడుతుందన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని పలువురు సర్పంచ్‌లు చెప్పారు. గోమంగి మినీ గురుకుల పాఠశాలలో మెనూ అమలుచేయడం లేదని ఎంపీటీసీ సభ్యురాలు రాములమ్మ తెలిపారు. పాత రూడకోటలో ఎంపీపీ పాఠశాలలో నాడు–నేడు మొదటి విడతలో నిధులు మంజూరైనా పనులు సక్రమంగా చేయలేదని, నిధులు రికవరీ చేయాలని సర్పంచ్ సురేష్‌కుమార్ చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పాటించడం లేదని, అధికారులు పర్యవేక్షించాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ కృష్ణారావు, వైస్ ఎంపీపీలు సోనే, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ నేతలు

హుకుంపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు శామ్యూల్, జేసీఎస్ మండల కన్వీనర్ కె.రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, గుమ్మా శ్యామ్‌సుందర్, సన్నిబాబు, ఎంపిటీసీ సుశీల, లక్ష్మయ్య, నాయకులు చిన్నబ్బి, అనిల్, సింహాచలం, మురళి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణపై అవగాహన



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న రైతు సాధికార సంస్థ ఇన్‌చార్జి ప్రసాద్



చవిటిదిబ్బలులో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తున్న ఏవో ఉషారాణి

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరిలో లైన్ షోయింగ్ నాట్లు వేసిన వెంటనే అజోలా పొలం వేయటం వలన కలుపు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం విభాగ రైతు సాధికార సంస్థ ఎం నిట్టాపుట్ట యూనిట్ ఇన్‌ఛార్జీ ఎం ప్రసాద్ తెలిపారు. సింగర్బ పంచాయతీ ఎం నిట్టాపుట్టు గ్రామంలో వరినాట్లు వేసిన పొలం కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వరినాట్లు వేసిన వెంటనే పొలం అజోలా వేయటం వల్ల కలుపు నివారించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులతో వరిలో లైన్‌షోయింగ్ నాట్లు రైతులతో వేయించారు. యూనిట్ సిబ్బంది పాపారావు, రైతులు పాల్గొన్నారు.

వై.రామవరం: పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో ఇంతవరకు నిర్వహించిన శిక్షణ తరగతులపై ఏఓ ఉషారాణి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహిచారు. నేర్చుకున్న అంశాలపై రైతులను ప్రశ్నలు అడిగి పరీక్షించారు. ఆమె మాట్లాడుతు పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.యాజమాన్య పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేయడం, సేంద్రియ ఎరువులు తయారీ, వాటి వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వీఏఏలు, వీహెచ్ఏలు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంటులు రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా ఈ–క్రాప్ నమోదు (ఈకేవీసీ) సమర్థవంతంగా చేపట్టాలని తహసీల్దార్ వైవీ. సుబ్రహ్మణ్యాచారి సూచించారు. వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించి ఈ–క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ క్రాపు నమోదులో సాగుదారు పేరు, భూమి సర్వే నెంబర్, విస్తీర్ణం, ఏ పంట సాగుచేస్తున్నది తదితర వివరాలను సమగ్రంగా నమోదు చేయాలన్నారు. పంట నమోదులో ఎటువంటి తప్పులకు తావులేకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఆగస్టు ఒకటవ తేదీ నుంచి ఈ క్రాపు నమోదు చేయాలని, అందుకు తగినట్లుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ఏవో రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

31న చలో కలెక్టరేట్

అరకులోయ రూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 31న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి మండల కార్యదర్శి భగత్‌రాం చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎండీఎం సిబ్బంది సమస్యలపై చేపడుతున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వంతెన పనుల పరిశీలన



బిరిగూడ వద్ద జరుగుతున్న వంతెన పనులు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ వాగుపై వంతెన పనులు మొదలైయ్యాయి. బిరిగూడ వాగుకు ఇరువైపులా పునాది పనులు ప్రారంభించారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ ఏఈఈ ప్రాజెక్ట్స్ సంతోష్, లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్‌లు ఆయా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈఈ సంతోష్ మాట్లాడుతూ బిరిగూడ వంతెన నిర్మాణానికి రూ.3.55కోట్లు మంజూరయ్యాయని, వర్షాలు తగ్గిన వెంటనే వాగు వద్ద డైవర్షన్ వంతెనను నిర్మించి, పనులు వేగవంతం చేస్తామన్నారు. బుంగాపుట్టు, లక్ష్మీపురం పంచాయతీలకు చెందిన సుమారు 26 గ్రామాల గిరిజనుల రవాణా కష్టాలు ఈ వంతెన నిర్మాణం పూర్తయితే తీరనున్నాయి. వంతెన పనులు మొదలు అవ్వడంతో ఆ ప్రాంతీయులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



రింతాడ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



డిప్పలగొందిలో బడిబయట పిల్లల వివరాలను పరిశీలిస్తున్న ఎంఈవో బాబూరావుపడాల్



చింతపలిల్లో పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతీ

గూడెంకొత్తవీధి: రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం పాఠశాలను సందర్శించినట్టు చెప్పారు. బడి ఈడు పిల్లలను, బడి మానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లి దండ్రులపై ఉందన్నారు. అనంతరం ఏబులం ఎంపీపీ పాఠశాలలో తనిఖీ చేయగా, పూర్తిస్థాయిలో హాజరు ఉన్నట్టు గుర్తించారు.

జి.మాడుగుల: నుర్మతి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో వంద్రంగుల హేబిటేషన్‌లో డిప్పలగొంది గ్రామాన్ని ఎంఈవో సీహెచ్.బాబూరావుపడాల్ బుధవారం సందర్శించారు. గ్రామంలో బడిఈడు పిల్లల గురించి అడిగి తెలుసుకున్నారు. బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

జి.మాడుగుల: కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని వంజరి పంచాయతీ కృష్ణాపురం, పినకిల్తారి గ్రామాల్లో పాఠశాలలను ఎంపీడీవో చంద్రశేఖరరావు బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. బడి ఈడు పిల్లల గురించి ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు,మెనూలను ఆయన తనిఖీ చేశారు. నాడు–నేడు పథకం కింద చేపట్టిన పనులు గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు.

చింతపల్లిరూరల్: కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని చౌడుపల్లి, గెంజిగెడ్డ, చేదలపాడు పాఠశాలలను ఎంపీడీవో ఆశాజ్యోతి బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. డ్రాప్ అవుట్స్ విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకొని, వారు పాఠశాలకు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆమె కోరారు.అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు.



కృష్ణాపురం పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొయ్యూరు: ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన జనుమూరి గిరిబాబు సభ్యులు గణేశ్, రాజు, ఉపాధ్యాయులు బెన్నాస్వామి, మల్లేశ్వరరావు బుధవారం 45 మందికి సంస్థకు చెందిన టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. వారంతా గతనెల 21న యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగా పోటీల్లో పాల్గొన్నారు. వారికి ఈ సందర్భంగా షర్ట్‌లను అందజేశారు.యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

రహదారి నిర్మించాలి

అడ్డతీగల: ఏజెన్సీ నుంచి ఏలేశ్వరం వైపు గొంటువానిపాలెం నుంచి రమణయ్యపేట వరకు రోడ్డు నిర్మించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్, గిరిజన సంఘం నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. నాయకుడు గణేష్ మాట్లాడుతూ ఈ దారి గోతులతో నిండి ఉండడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో రోడ్డుకు అడ్డంగా గోడ కడతామన్నారు. నేతలు మిశ్రా, కుశల, ప్రసాద్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం అమలుకు చర్యలు

ఎటపాక: బారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం అమలుకు పకడ్బందీగా చేస్తున్నట్టు ఎటపాక నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ లక్ష్మీరాజం బుధవారం తెలిపారు.దేశంలో విద్యా విధానంలో 2020లో అనేక మార్పులు తీసుకువచ్చారని, ఇందులో భాగంగా నవోదయలో వివిధతరగతుల్లో బోధనలో మార్పు తీసుకొచ్చామన్నారు. విద్యార్థులు పరిమితులు లేకుండా ఏ సబ్జెక్టులు లేదా స్ట్రీమ్‌లను ఎంచుకునే స్వేచ్ఛను ఇస్తుందని వివరించారు.

మణిపూర్ ఘటనను వ్యతిరేకిస్తూ ర్యాలీలు





రాజవొమ్మంగి, వై.రామవరంలో ర్యాలీల్లో పాల్గొన్న గ్రామస్తులు

రాజవొమ్మంగి/వై.రామవరం/చింతపల్లి రూరల్: మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అకృత్యాలను నిరసిస్తూ రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో బుధవారం ర్యాలీలు నిర్వహించారు. రాజవొమ్మంగిలో అన్ని మతాలకు చెందిన నాయకులు శాంతి ర్యాలీ చేపట్టారు.దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. వై.రామవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. చింతపల్లిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు మణిపూర్ సంఘటనపై గిరిజనులను రెచ్చగొట్టే ధోరణి మానుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా జనసేన నాయకుడు గంగులయ్య వాఖ్యలు చేయడం తగదని ఆయన హెచ్చరించారు.

చట్టాలు అమలుచేయాలి

రంపచోడవరం: జిల్లా కిసాన్ సంయుక్త మొర్చా ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సదస్సులో ఏఐకెఎంఎస్ ప్రతినిధులు లచ్చిరెడ్డి, పి.టాన్యా మాట్లాడుతూ రైతులకు నష్టం కలిగించే చట్టాలను కేంద్రం రద్దు చేయాలని, స్వామి నాధన్ కమీషన్ సిఫార్సులు అమలుచేయాలన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించి కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.